క్లుప్తంగా

జూలైలో అనస్థీషియా సౌత్ జోన్ సదస్సు



సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

బీచ్‌రోడ్డు: కొత్త ఏడాది జూలై 3 నుంచి 6వ తేదీ వరకు సౌత్ జోన్ అనస్థీషియా సదస్సు నిర్వహించనున్నట్లు ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియా(ఐఎస్ఏ) స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. రామ్‌నగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ జోన్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ జి.రాజశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఈ సదస్సుకు సుమారు 1,500 మంది వైద్యులు వివిధ ప్రాంతాల నుంచి హాజరవుతారని చెప్పారు. ఏర్పాట్లు, సదస్సులో చర్చించాల్సిన పలు అంశాలకు సంబంధించి నిర్ణయాలపై చర్చించారు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్ట్ నేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఠాగూర్, డాక్టర్ చక్రరావు, డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ కుచేలుబాబు, సెక్రటరీ డాక్టర్ వి.రవి, రాష్ట్ర కార్యదర్శి మదన్‌రెడ్డి, నగర శాఖ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓపెన్ పికిల్‌బాల్ టోర్నీలో వాల్తేరు క్లబ్ ప్రతిభ



ట్రోఫీతో చిరాగ్, కరణ్

బీచ్‌రోడ్డు: అత్తిలి స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహించిన విశాఖ ఓపెన్ పికిల్‌బాల్ టోర్నమెంట్‌లో వాల్తేరు క్లబ్ సభ్యులు ప్రతిభ చూపారు. ఈ క్లబ్‌కు చెందిన చిరాగ్ టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసి సింగిల్స్‌లో విజయం సాధించాడు. కరణ్‌తో కలిసి డబుల్స్, రష్మికతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో విజేత నిలిచాడు. ఈ సందర్భంగా ఆదివారం అత్తిలి స్పోర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ శశికరణ్ విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పికిల్‌బాల్ క్రీడను ప్రోత్సహించేందుకు సిరిపురం, ఎండాడ, మాధవధార ప్రాంతాల్లో కోర్టులు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో నగరంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మెగా టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి



పోక్సో చట్టంపై అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: విద్యార్థుల అభ్యున్నతికి, క్రమశిక్షణతో కూడిన జీవనానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధుల కృషి అవసరమని, కెప్టెన్స్ పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖపట్నం, అల్లూరి జిల్లాల ఉపాధ్యాయ ప్రతినిధులకు కొద్ది రోజులుగా ఈస్ట్ కోస్ట్ క్యాంపింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న బేసిక్ కోర్స్ ఫర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్స్ శిబిరంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయిస్తున్నా, నిత్యం బాలల హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని, ఇది ప్రమాదకరమన్నారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ సారథ్యంలో పోక్సో చట్టంపై రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించారు.కోరారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య సేవలకు దూరం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం ఎదురుచూపులు
- స్థల వివాదంతో పనులు ప్రారంభించి నిలుపుదల
- మరో వార్డుకు యూపీహెచ్‌సీ తరలింపు
- తమ ప్రాంతంలోనే నిర్మించాలని 28వ వార్డు ప్రజల విజ్ఞప్తి

తమ వార్డులో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తున్నారని ఆనందించే లోపే దానిని వేరే వార్డుకు తరలించడంతో 28వ వార్డు ప్రజలు నిరాశకు గురయ్యారు. వారికి వచ్చే చిన్న చిన్న వ్యాధులకు ఉచితంగా దగ్గరలోనే వైద్యం అందుతున్న ఆశలు.. అడియాశలుగా మిగిలిపోయాయి. దీంతో అందుబాటులో వైద్య సేవలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 28వ వార్డు ప్రజల ఆరోగ్యానికి భరోసా అందించేందుకు తమ వార్డులోనే ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీని కోసం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నామని చెబుతున్నారు.

– బీచ్‌రోడ్డు





28వ వార్డు నెహ్రూనగర్‌లో నిర్మించి నిలిపేసిన పట్టణ ఆరోగ్య కేంద్రం



వార్డులో నిరుపయోగంగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనం

జీవీఎంసీ 28వ వార్డులోని రామ్‌నగర్, జై సంతోషమాతా కాలనీ, పితానిదిబ్బ, నెహ్రూ నగర్ వంటి ప్రాంతాల్లో బడుగు బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా.. కేజీహెచ్ వంటి పెద్ద ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి వారిది. ముఖ్యంగా చిన్న చిన్న రోగులకు కూడా కేజీహెచ్‌కు వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో వారికి ఆరోగ్య భరోసా కల్పించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వార్డులో పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా వార్డు ప్రజల కోరిక నెరవేర్చుతూ యూపీహెచ్‌సీని మంజూరు చేసింది. దీనిని నెహ్రూనగర్‌లోని ఒక ఖాళీ స్థలంలో నిర్మించేందుకు జీవీఎంసీ అనుమతులను ఇచ్చింది. దీంతో ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను ప్రారంభించారు.

ఆనందించే లోపే ఆటంకం

నెహ్రూనగర్‌లో ఎంతో వేగంగా కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రం పనులకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. ఆ స్థలం తమదని సొసైటీ వ్యక్తులు కోర్టులో కేసు వేయడంతో స్టే విధించింది. దీంతో 28వ వార్డుకు కేటాయించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని 20వ వార్డు పెదవాల్తేరుకు తరలించారు. తమ చెంతకు ఆరోగ్య కేంద్రం వస్తుందని ఎంతో ఆనందించిన ప్రజలకు నిరాశే ఎదురైంది.

నిరుపయోగంగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్

నెహ్రూనగర్‌లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిరుపయోగంగా మారి శిథిల స్థితికి చేరింది. సుమారు 1,500 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ హాస్టల్ స్థలం పూర్తిగా ప్రభుత్వానిదే. దీంతో ఈ స్థలంలో ఆరోగ్య కేంద్రం నిర్మించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు. ఆ హాస్టల్‌కు మరమ్మతులు చేసి ఆరోగ్య కేంద్రంగా వినియోగించాలని లేదా నూతన హెల్త్ సెంటర్ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు వినతి



కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పల్లా దుర్గారావు(ఫైల్)

ఆరోగ్య కేంద్రం అందుబాటులో లేక వార్డులోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఇటీవల జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ దృష్టికి వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు తీసుకెళ్లారు. వార్డులో నిరుపయోగంగా ఉన్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

వార్డులో ఆరోగ్య కేంద్రం అవసరం



మా వార్డులో బడుగు బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. వారికి చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా కేజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తోంది. సమయంతోపాటు ఆర్థిక ఇబ్బందులు కూడా ఎదుర్కొంటున్నారు. మా వార్డులో పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. గతంలో కేటాయించిన ఆరోగ్య కేంద్రాన్ని కొనసాగించాలి.

– పల్లా అప్పలకొండ, కార్పొరేటర్, 28వ వార్డు

నాడు ఎంతో ఆనంద పడ్డాం



మా ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తున్నారని తెలిసి చాలా సంతోషపడ్డాం. ఏ అనారోగ్య సమస్య వచ్చినా ఆస్పత్రి దగ్గరలోనే ఉంటుందని అనుకున్నాం. ఇంతలోనే స్థల వివాదంతో దానిని వేరే ప్రాంతానికి తరలించారు. మా ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలి.

– జి.విశాలాక్షి, నెహ్రూనగర్

పెద్ద ఆస్పత్రే దిక్కు



మా ఆరోగ్యం ఏమాత్రం బాగోలేకపోయిన అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో పెద్ద ఆస్పత్రి కేజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ గంటల తరబడి ఓపీ కోసం వేచి ఉండి వైద్యులకు చూపించుకోవాలి. ఇలా చాలా సమయం వృథా అవుతోంది. మా ప్రాంతంలోనే అందుబాటులో ఆరోగ్య కేంద్రం ఉంటే ఏ సమస్యా ఉండదు.

– కె.లక్ష్మి, రామ్‌నగర్

దర్శకుడు శ్యామ్ బెనగల్ సంస్మరణ సభ నేడు

మద్దిలపాలెం: బాలీవుడ్ సినీ దర్శక దిగ్గజం శ్యామ్ బెనగల్ సంస్మరణ సభను ఈ నెల 30న నిర్వహించనున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి ఎన్.ప్రకాశరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు సభ జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ బెనగల్ దర్శకత్వం వహించిన చిత్రాన్ని ప్రదర్శిస్తామని, ఈ కార్యక్రమానికి అందరూ తరలి రావాలని ఆయన కోరారు.

విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డులో అంధకారం



విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డులో వెలగని విద్యుత్ లైట్లు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డు చీకటిమయమవుతోంది. ఈ రహదారిలోని విద్యుత్ లైట్లు నెల రోజులుగా వెలగడం లేదు. దీంతో ఈ రోడ్డులో రాత్రిళ్లు చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇరుకు దారిగా ఉన్న దీన్ని రెండేళ్ల కిందట డబుల్ రోడ్డుగా విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ లైట్లన్నీ నెల రోజులుగా వెలగడం లేదు. దీంతో రెండు కొండల మధ్య ఉన్న ఈ రహదారిలో అంధకారం నెలకొంటోంది. సీతకొండ, జూ పార్కు కొండల మధ్య నుంచి తరచూ విషసర్పాలు, వన్యప్రాణులు రోడ్డు మీదకు చేరుతున్నాయి. వాటితో చీకటిలో ఇబ్బంది పడుతున్నామని వాహన చోదకులు చెబుతున్నారు. దీంతోపాటు జాతీయ రహదారి నుంచి విశాఖ వ్యాలీ స్కూల్ మీదుగా బీచ్ రోడ్డు కూడలి వరకు ఐదు చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. చీకట్లో అవి కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు పరిశీలించి ఈ రోడ్డులో లైట్లు వెలిగించాలని కోరుతున్నారు.

అద్భుతం.. భువన విజయం నాటక ప్రదర్శన



భువన విజయం నాటకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన భువన విజయం నాటక ప్రదర్శన అద్భుతంగా సాగింది. ప్రతి ఏడాది చివరిలో కళాభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది సాహిత్య సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా భువన విజయం నాటకాన్ని ప్రదర్శించారు. సాహితీవేత్తలతో సమ్మేళనం చేపట్టారు. ముందుగా ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, కట్టమూరి చంద్రశేఖర్, ఎ.ఇందిర, విజయలక్ష్మి, పిళ్లా రమణమూర్తిలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ సాంస్కృతిక, సంగీత, నాట్య, సాహిత్య, నాటక, హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, జానపద తదితర అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ అన్ని కళలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు భాషకు, సంగీతానికే కాదు దేనికైనా ప్రాణవాయువు లాంటిది సాహిత్యమేనన్నారు. అలాంటి గొప్ప సాహిత్య ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమే భువన విజయం నాటక ప్రదర్శనని పేర్కొన్నారు. అనంతరం విజయనగరానికి చెందిన కట్టమూరి చంద్రశేఖర్ రచించి, దర్శకత్వం వహించి రూపొందించిన భువన విజయం నాటకాన్ని ప్రదర్శించి అలరించారు. అధికంగా వచ్చిన సాహితీప్రియులు, ప్రేక్షకుల హర్షధ్వానాలతో కళాభారతి మార్మోగింది.

వనభోజనాల సందడి



పిల్లలకు బహుమతులు అందిస్తున్న బాలభాను అర్చక, పురోహిత సంఘం పెద్దలు

ఆరిలోవ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో ఆదివారం బాలభాను అర్చక, పురోహిత సంఘం వనభోజనాలు నిర్వహించింది. కుటుంబ సభ్యులతో ఎంతో ఉత్సాహంగా.. సందడిగా జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సినీ హీరో కంచర్ల ఉపేంద్ర పాల్గొని మాట్లాడారు. అర్చక పురోహిత కుటుంబాలంతా ఒకే చోట కలిసి గడపడం అభినందనీయమన్నారు. ఈ సంఘానికి ఉపకార్ సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలకు ఆటపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకుడు పంతుల వెంకటరమణ, అధ్యక్షుడు జ్యోషుల కామేశ్వరరావు శర్మ, మావుడూరు కిశోర్‌కుమార్ శర్మ పాల్గొన్నారు.

ముగిసిన ‘వేంకటేశ్వర వైభవం’ ప్రవచనాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



మాస్టర్ ఇ.కె. రచించిన గోదా వైభవం కావ్యాన్ని విభీషణ శర్మకు బహూకరిస్తున్న సత్యదేవ్

ఎంవీపీకాలనీ: శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కు వేదికగా ఈ నెల 26 నుంచి జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర వైభవం ప్రవచన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విభీషణ శర్మ వేంకటేశ్వర స్వామి వైభవంపై చివరి రోజు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్యక్రమ నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. మాస్టర్ ఇ.కె. రచించిన గోదా వైభవం కావ్యాన్ని విభీషణ శర్మకు జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ బహూకరించారు. ప్రవచనాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిగీతాలాపనలు ఆకట్టుకున్నాయి.

బయోడైవర్సిటీ పార్క్ సందర్శన



బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థుల సందడి



పార్క్‌లోని చెట్టుపై గుడ్లగూబలు

బీచ్‌రోడ్డు: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఆదివారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యత, విశేషాలను తెలియజేశారు. పార్క్‌లో మొక్కలను పరిశీలిస్తున్న విద్యార్థులను గుడ్లగూబ పక్షులు ఆసక్తిగా గమనించాయి. ఈ దృశ్యం విద్యార్థులను కనువిందు చేసింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీధర్, పి.వి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా, శ్రీనుబాబు తదితరులు

ఎంవీపీకాలనీ: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి అత్యంత మహిమాన్వితుడని మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సింహాద్రి అప్పన్న అలంకరణతో కూడిన 2025 ప్రత్యేక క్యాలెండర్‌ను ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో ఆదివారం అప్పన్న దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల కోర్కెలు తీర్చే సింహాద్రి అప్పన్న ఎంతో ప్రత్యేకమన్నారు. ఏటా ఉత్సవాల్లో అప్పన్నకు చేసే అలంకరణలతో ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి భక్తులకు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి, పుష్కర గణేష్, బత్తుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గేటు.. పట్టించుకోకుంటే చేటు!



బీచ్ రోడ్డులోని ఆల్ ఎబిలిటీ పార్క్ వద్ద కూలే స్థితిలో ప్రమాదరకంగా ఉన్న గేటు



ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో వైఎంసీఏకు ఎదురుగా ఉన్న ఆల్ ఎబిలిటీ పార్క్ నుంచి సముద్ర తీరానికి వెళ్లే గేటు పరిస్థితి ప్రమాదకరంగా మారింది. పార్క్‌కు వచ్చే సందర్శకుల్లో అనేక మంది ఈ మార్గం గుండానే బీచ్‌లోకి వెళ్తారు. ప్రస్తుతం ఒక గేటు కూలిపోయింది. మరో గేట్ కూడా కూలడానికి సిద్ధంగా ఉంది. ఎవరి మీదనైనా ఇది పడితే ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతుంది. అధికారులు స్పందించి వెంటనే ఈ గేటును తొలగించి, మరమ్మతులు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లపై రంగులు మాయం





ఆరిలోవ సూర్యతేజనగర్ వద్ద స్పీడ్ బ్రేకర్లపై చెరిగిపోయిన రంగులు

ఆరిలోవ: ప్రధాన రహదారులపై వాహనాల వేగ నియంత్రణకు నిర్మించిన స్పీడ్ బ్రేకర్లపై రంగులు మాయమవుతున్నాయి. ఆరిలోవ సూర్యతేజనగర్ వద్ద స్పీడ్ బ్రేకర్ల పరిస్థితి ఇది. చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా మందిరం నుంచి పార్వతీనగర్ వరకు గతేడాది నిర్మించిన డబల్ రోడ్డుకు ఇరువైపులా సూర్యతేజనగర్ వద్ద రెండు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వాటిపై రేడియం రంగులు కాకుండా సాధారణ రంగులు వేశారు. అవి ఇటీవల కురిసిన వర్షాలకు కరిగి చెరిగిపోయాయి. దీంతో రాత్రి వేళల్లో ఇక్కడి స్పీడ్ బ్రేకర్లను గుర్తించలేక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తూ పలువురు స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపుతప్పి పడిపోయి గాయాలపాలయ్యారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు స్థానికులు, వాహన చోదకులు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి స్పీడ్ బ్రేకర్లపై రేడియం రంగులు వేయాలని వారు కోరుతున్నారు.

అలరించిన కోలాటం



కోలాట ప్రదర్శనలో యోగ చైతన్య బృందం

సీతంపేట: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో యోగ చైతన్య కోలాట బృందం (శంకరమఠం) చేసిన కోలాట ప్రదర్శన అలరించింది. శ్రీభూ నీలా సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఉత్సవమూర్తుల ఎదుట బృంద సభ్యులు హరినామ సంకీర్తనలకు కోలాటంతో నీరాజనం అర్పించారు. బృంద నాయకురాలు కె.పద్మజ ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన జరిగింది. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ వీరిని సత్కరించారు. అమావాస్య సందర్భంగా సోమవారం ఉదయం 9 .30 గంటలకు అధర్వణ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తామని కృష్ణసేన్ తెలిపారు.

తెలుగు సాహిత్యానికి ఆదరణ

సీతంపేట: సాఫ్ట్‌వేర్ రంగం వచ్చినా తెలుగు కథలకు, తెలుగు సాహిత్యానికి ఆదరణ తగ్గలేదని రచయిత ఈతకోట సుబ్బారావు అన్నారు. తటవర్తి భారతి స్మారక సాహిత్య సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కథ, కథనం అంశంపై ప్రసంగించారు. తారు రోడ్డు రాకముందే కథలు ఇక్కడ పుట్టాయని, మహాకవి ఆరుద్ర అన్నట్టు తల్లి ఒడిలో నుంచే కథలు నేర్చుకుంటామని తెలిపారు. కరోనా, సోషల్ మీడియా పుణ్యమా అని ఒక రకంగా తెలుగు భాష బతికి బట్ట కట్టిందన్నారు. కథల్లో మానవీయ కోణం ఉండాలని, మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్న తరుణంలో కథల్లో కూడా మార్పు వచ్చిందన్నారు. తెలుగు సాహిత్యంలో ఎంతో మంది కథలు రాసే వారు ఉన్నారని, తెలుగు సాహిత్యానికి ఆదరణ తగ్గలేదన్నారు. రచయిత ఎం.సుగుణరావు మాట్లాడుతూ పాలకులు చేపట్టే విధానాల వల్ల రకరకాల సంస్కరణలు వచ్చాయని, ఫలితంగా కొన్ని కుల వృత్తులు దూరమయ్యాయని తెలిపారు. గోద్రా అల్లర్లు తర్వాత వచ్చిన కథ, అమెరికన్ రచయిత జేమ్స్ రాసిన నవల గురించి వివరించారు. కథా పఠనం, రికార్డింగ్‌లో మెలకువలపై రాంబాబు కొప్పర్తి, పప్పు భోగారావు ప్రసంగించారు. విమర్శ, విశ్లేషణ, సమీక్ష అనే అంశాలపై సీహెచ్.సుశీలమ్మ, డి.వి.సూర్యారావు మాట్లాడారు. ఈ సందర్భంగా 14 మంది కవులు, రచయితలకు తటవర్తి భారతి సాహిత్య పురస్కారాలు అందజేశారు.